క్లుప్తంగా

● నివాళి



మేరీని ఓదార్చుస్తున్న మాజీ మంత్రి రోజా

నిండ్ర: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మేరీ భర్త జయరాంరెడ్డి (60)గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. ఇది తెలుసుకున్న మాజీ మంత్రి రోజా మంగళవారం స్థానికంగా మేరీ నివాసానికి వెళ్లి ఆమె భర్త మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మేరీ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమెతోపాటు ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్, సర్పంచ్ బాబురెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ అనిల్, ఎంపీటీసీ విజేష్, నాయకులు మునికృష్ణారెడ్డి, శివయ్య, చెంచమ్మ, వీరయ్య, మునిరాజ్, సత్యరాజ్, సంపత్ తదితరులు నివాళులు అర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



రోడ్డును శుభ్రం చేయిస్తున్న సర్పంచ్ భారతి

వెదురుకుప్పం: మండలంలోని దిగువపల్లాలు పంచాయతీ ఆళ్లమడుగు ఎస్సీ కాలనీలో మంగళవారం స్థానిక సర్పంచ్ కామసాని భారతి ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులను ముమ్మరంగా చేశారు. రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం, వీధుల పక్కన పేడదిబ్బలను తొలగించారు. ముళ్లకంపలను, రాళ్లను జేసీబీతో చదును చేసి శుభ్రం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, దీపావళి సందర్భంగా అన్ని గ్రామాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధి బైపాస్ కూడలి సమీపంలోని శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. అయ్యప్ప పాటల భజన చేశారు. ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. ఎస్.విశాలాక్షి, లక్ష్మణ్ ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు



అంబేడ్కర్ కాలనీలో నీళ్ల ట్యాంక్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు

విజయపురం (వడమాలపేట): వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం పంచాయతీ అంబేడ్కర్ కాలనీలోని నీళ్ల ట్యాంకు చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి పాములకు ఆవాసంగా మారింది. గంటకోసారి గేట్ వాల్వ్ తిప్పడానికి వెళుతున్న వారు పాములను చూసి హడలిపోతున్నారు. పిచ్చిమొక్కలు తొలగించాలని గతంలో ఎన్నోసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, అంతేకాకుండా మూడు నెలలకోసారి ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పిచ్చిమొక్కలను తొలగించి ట్యాంక్‌ను బ్లీచింగ్ చేయాలని కోరుతున్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

విజయపురం: తమిళనాడు సరిహద్దు గాండ్లకండ్రిగ చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ బలరాం తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా వాహనాలను తనిఖీ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



పిచ్చిమొక్కలతో దర్శన మిస్తున్న బోడిరెడ్డి చెరువు



సాగుకు సిద్ధంగా ఉన్న భూములు

నిండని చెరువులు..
బీళ్లుగా భూములు

ఇటీవల వరుసగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఆ తర్వాత దానా తుపాను ప్రభావంతో జిల్లాలోని కొన్ని మండలాల్లో విస్తారంగా వర్షాలు కురిసినా ఇక్కడ వరుణుడి కరుణ కరువైంది. సాధారణ వర్షపాతం కంటే ఎక్కువే నమోదైనా చెరువులకు చుక్క నీరు చేరలేదు. తుపాను ధాటికి వర్షాలు కురిసి చెరువుల జలకళతో తొణికిసలాడుతాయని ఆశించిన రైతాంగానికి నిరాశే ఎదురైంది. ఇప్పటికే పంటలు సాగు చేసిన రైతులు కొందరు నిరాశ నిస్పృహలతో కొట్టుమిట్టాడుతున్నారు. మరికొందరు నీళ్లు లేక భూములను బీడుగా ఉంచుకోవాల్సి పరిస్థితి నెలకొంది.

- ఊరించి జాడ లేని వర్షాలు
- ఆందోళన చెందుతున్న రైతన్నలు

వెదురుకుప్పం: మండలంలో మొత్తం 376 చెరువులు ఉన్నాయి. వీటిలో ఇరిగేషన్‌కు సంబంధించి 6, పెద్ద చెరువులు136 ఉండగా మిగిలినవి చిన్న చెరువులు, కుంటలు. వేసవి కాలంలా ఎండల తీవ్రత ఉండడంతో చెరువుల్లో ఉన్న అరకొర నీళ్లు ఆవిరైపోతున్నాయి. ప్రధానంగా టీకేఎంపురం సమీపంలోని చెంజివెంకటరెడ్డి చెరువు, పాతగుంట, వేణుగోపాలపురం సమీపంలోని చెరువు, కనికాపురం, గుండుపల్లె చెరువుల్లో నీళ్లు అడుగంటిపోయాయి. వెదురుకుప్పం సమీపంలోని కొత్త చెరువు, పెద్దబైలు, మారేపల్లె, గోవిందవారిపల్లె సమీపంలోని బోడిరెడ్డి చెరువు, కోణంగిపల్లె చెరువుల్లో మట్టి తీసిన కుంటల్లో మాత్రమే నీరు కాస్తో కూస్తో ఉంటోంది. ఇక, దిగువగెరిగదొన, కసవనూరు చెరువుల్లో నీళ్లు చేరినా ఎక్కువ రోజులు నిల్వ ఉండని పరిస్థితి. కొన్నిచోట్ల నీళ్లు లేక వెలవెలబోతున్నాయి. వర్షపు నీటితో కళకళలాడాల్సిన చెరువులు పిచ్చి మొక్కలు, ఉపాధి కుంటలతో దర్శనమిస్తున్నాయి. మండలంలో సుమారు 6వేలకు పైగా వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. చెరువులు నిండకపోతే బోర్లలో నీటి మట్టం పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వర్షం పడినా చెరువులకు చేరని వైనం

మండలంలో గత ఐదు నెలల్లో సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షాలు కురిసినా చుక్క నీరు కూడా చెరువులకు చేరలేదు. ప్రధానంగా సప్లయ్ చానళ్లు పిచ్చిమొక్కలతో ఉండటం కూడా ఒక కారణమని రైతన్నలు చెబుతున్నారు.

వరిపై వర్రీ

వర్షాభావం వరి రైతులకు శాపంగా మారింది.

నమోదైన వర్షపాతం మిల్లీమీటర్లలో (2024లో)

నెల	సాధారణ వర్షపాతం	నమోదైన వర్షపాతం
జూన్	71.8	121.0
జూలై	103.8	158.8
ఆగష్టు	122.0	122.8
సెప్టెంబర్	133.0	127.6
అక్టోబర్	161.0	231.6 (నేటి వరకు)

వరి సాధారణ సాగు 350 హెక్టార్లకు గాను 328 హెక్టార్లలో, వేరుశనగ 175 సాధారణ సాగు అవ్వాల్సి ఉండగా కేవలం 10 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. వచ్చే రెండు నెలల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులకు పుష్కలంగా నీరు చేరితే రైతులు వరి సాగు చేయాలనే ఆలోచనతో ఉన్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో పడకపోతే మాత్రం పొలాలను బీడుగా వదిలేయకతప్పదని చెప్పారు.

ఆరుతడి పంటలే నయం

రైతులు చెరుకు, వరి, వేరుశనగ పంటలు సాగు చేయడం కంటే ఆరుతడి పంటల సాగే శ్రేయస్కరమని అని అధికారులు చెప్పారు. ఆకుకూరల సాగు, పండ్ల తోటల పెంపకం, కూరగాయల సాగు చేయడం ఉత్తమమని చెబుతున్నారు. ఒకవేళ వర్షాలు తక్కువ కురిసిస్తే.. కరెంటు కష్టాలు రైతులను ఇబ్బందులు పెట్టవచ్చని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ పంటలను సాగు వైపు మొగ్గు చూపాలని సూచిస్తున్నారు.



నిండని కోణంగిపల్లె చెరువు

పంటల సాగులో మెలకువలు ముఖ్యం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

కార్వేటినగరం: మండలంలోని రైతులు వరి, వేరుశనగ సాగులో మెలకువలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆర్‌కేవీబీ పేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఆయన మాట్లాడారు. వరి, వేరుశనగ పంటలకు సేంద్రియ ఎరువులు విరివిగా వాడాలన్నారు. వ్యవసాయ శాఖ ద్వారా తీసుకున్న జింక్ సల్ఫేట్ బోరాన్ జిప్సం ఎరువులను సమతుల్యంగా వాడాలన్నారు. అపరాలతో పంట మార్పిడి చేయాలన్నారు. చెరకులో బిందుసేద్యం పద్ధతిలో పంటలు సాగు చేయవచ్చని, డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. వరిలో ఆకుముడుత, కాండం తొలిచే పురుగు నివారణ చర్యలు, చెరకు సాగులో ఎరువులు వాడేటప్పుడు తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



పాలసముద్రం: వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయాధికారి ఢిల్లీ ప్రసాద్ రైతులను కోరారు. మంగళవారం కన్నికాపురం, రామలింగాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులను వాడకం వైపు మొగ్గు చూపాలన్నారు. అధికంగా రసాయనిక ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోయి, కాలక్రమంలో చౌడు భూములుగా మారిపోతాయన్నారు. పచ్చిరొట్టను సాగు చేసుకోవాలన్నారు. పశువుల ఎరువుతో భూములు సారవంతమవుతాయన్నారు. సాగు చేసిన పంటలను తెగుళ్లు ఆశించినప్పుడు సంబంధిత వ్యవసాయాధికారులకు చూపించి, వారి సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వనజ, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగు పరచండి



వడమాలపేట సాధారణ సర్వసభ్య సమావేశం

విజయపురం (వడమాలపేట): మండలంలో పారిశుధ్యం మెరుగు పరచి, కాలువల్లో పూడిక తీయాలని వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా పురోగతిని అధికారులు నివేదించారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో మంజూరై వివిధ దశల్లో నిలిచిపోయిన జగనన్న ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని కోరారు. ఎన్ఆర్‌జీఎస్ కింద మంజూరైన సీసీ రోడ్డు పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఏపీఓ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల పనితీరు బాగాలేదని, స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పడిపోతోందని ఎంపీటీసీ సభ్యులు ధ్వజమెత్తారు. ఇప్పటికే ఒక పాఠశాల మూతపడిందని, మరో రెండు పాఠశాలలు మూసివేత దిశగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా దీనిపై దృష్టి సారించి విద్యారంగం బలోపేతానికి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సిన ఆర్ఎంపీలు ఇంజెక్షన్లు వేస్తున్నారని, సైలెన్లు ఎక్కిస్తున్నారని దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ జరీనా, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నిధులు డ్రా చేసి స్వాహా..!

- పంచాయతీ కార్యదర్శిపై ఆరోపణ
- సర్పంచ్ తీసుకున్నాడని చెబుతున్న కార్యదర్శి

విజయపురం: తాను చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు డ్రా చేసి తనకు ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి స్వాహా చేశాడని గంగమాంబపురం గ్రామానికి చెందిన సురేష్ ఆరోపించారు. బాధితుని కథనం మేరకు.. అప్పటి పంచాయతీ కార్యదర్శి కిషోర్, వార్డు సభ్యుల తీర్మానం మేరకు సుమారు రూ.1.20 లక్షలతో విద్యుత్ మోటార్, పంచాయతీ ఆర్వో ప్లాంట్ భవన మరమ్మతులతో పాటు ఎస్టీ కాలనీకి చెందిన శ్మశాన అభివృద్ధి పనులను సురేష్ చేశారు. తదనంతరం బదిలీపై వచ్చిన పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పనులకు సంబంధించిన నిధులను విత్‌డ్రా చేసి ఇవ్వలేదు. అంతే కాకుండా ఎస్టీ కాలనీ శ్మానం అభివృద్ధికి రూ.48వేలు ఖర్చు చేస్తే, చంద్రశేఖర్ రూ.70వేలు విత్‌డ్రా చేశారని సురేష్ ఆరోపించారు. తాను చేసిన పనులకు డబ్బులు చెల్లించాలని, జిల్లా అధికారులు తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశాడు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా.. సురేష్ చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన సొమ్మును తాను తీసుకోలేదని, సర్పంచ్ తీసుకున్నారని తెలిపారు.

వన్య ప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

అటవీశాఖ అధికారులు కరణ్ సింగ్

కార్వేటినగరం: వన్యప్రాణులను వేటాడితే కఠినమైన కేసులు, జైలుశిక్ష తప్పదని కార్వేటినగర్ క్షేత్ర అటవీశాఖాధికారి కరణ్‌సింగ్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ సచివాలయంలో అటవీ శాఖాధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరణ్‌సింగ్ మాట్లాడారు.. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. వన్యప్రాణులు, పశు పక్ష్యాదులపై కరుణ చూపాలని, వాటికీ జీవించే హక్కు ఉందన్నారు. ఎవరైనా వన్యప్రాణులను వేటాడినా, అటవీ సంపదను నాశనం చేసినా టోల్ ఫ్రీ నంబర్ 18004255909కు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే అటవీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్‌కు పాల్పడినా తమ శాఖ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కుమార్, అరుణాదేవి, గంగులయ్య, సచివాలయ సిబ్బంది, జనసేన ఇన్‌చార్జ్ పొన్న యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన



అంటు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ

పాలసముద్రం : అంటు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు అంటు వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించేలా చూడాలన్నారు. తీవ్ర జ్వరంతో బాధపడే వారిని గుర్తించి వారికి మలేరియా పరీక్షలు చేయాలని, అలాగే వారికి అవసరమైన మందులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

వెదురుకుప్పం: డ్రగ్స్ వాడకం ప్రాణాంతకమని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మంగళవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, డ్రగ్స్‌కు ఎవరూ బానిసలు కారాదన్నారు. మత్తు పదార్థాలకు బానిసకావడం వల్లే బాల్యం మసకబారుతున్నట్లు పేర్కొన్నారు. శారీరకంగా, మానసికంగా యువతను కుంగదీసి ఆర్థికంగా భవిష్యత్తుపై దెబ్బతీస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ మంగళగౌరి, డీఆర్సీ కో–ఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం : గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై కోరారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలలో ఒకటైన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీని దీపావళి కానుకగా నెరవేరుస్తోందన్నారు. వినియోగదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకుంటేనే గ్యాస్‌కు సంబంధించిన రాయితీ వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. ఎప్పటిలాగే గ్యాస్ బుక్ చేసుకుంటే నగదు చెల్లించి గ్యాస్ తీసుకోవలన్నారు. తరువాత 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ అవుతుందని, ఇప్పటి నుంచి మార్చి 31 వరకు ఒక సిలిండర్, ఏప్రిల్ నుంచి జూలై వరకు రెండో సిలిండర్, ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు మూడో సిలిండర్ ఇస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో గ్యాస్ డీలర్ రఘునీ, భాస్కర్‌నాయుడు, తిరుమల, రమణ తదితరులు పాల్గొన్నారు.

● ఆశీస్సులు



నూతన వధూవరులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: స్థానిక రాచపాళెంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోపి కుమారుడు దుర్గాగణేష్, రష్మితల వివాహ రిసెప్షన్ మంగళవారం రాత్రి పుత్తూరులో ఓ కళ్యాణ మండపంలో జరిగింది. మాజీ మంత్రి ఆర్కే రోజా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి

తవణంపల్లె: క్షయవ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్ ఆదేశించారు. మంగళవారం ఆయన తవణంపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ 3 నెలల్లోపు గర్భిణులు, పుట్టిన బిడ్డల నమోదు తప్పక చేయించాలని ఆదేశించారు. పిల్లలకు వంద శాతం టీకాలు వేయించి నమోదు చేయించాలన్నారు. టీబీ, లెప్రసీపై ఇంటింటి సర్వే చేసి నివేదిక ఇవ్వాలన్నారు. వర్షాలకు గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు కలుషితం కావడం వల్ల డయేరియా వ్యాపిస్తుందని, జాగ్రత్తలు పాటించేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం తాగునీటి ట్యాంకుల్లో నీటి పరీక్షలతో పాటు క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు.

ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర

- డీఆర్ఓ పుల్లయ్య సేవలు మరువలేనివి
- వీడ్కోలు కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



పుల్లయ్య చిత్రపటం అందజేస్తున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో డీఆర్వో పుల్లయ్య కీలకపాత్ర పోషించారని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. బదిలీపై వైఎస్సార్ కడప జిల్లాకు వెళుతున్న డీఆర్వో పుల్లయ్యకు మంగళవారం కలెక్టరేట్‌లో వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బదిలీపై వెళుతున్న పుల్లయ్య విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచారన్నారు. అంకిత భావంతో విధులు నిర్వర్తించిన ఆయన సేవలు మరువలేనివని తెలిపారు. కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల అధికారులతో సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా విధులు నిర్వర్తించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. పుల్లయ్య మాట్లాడుతూ తాను చాలా మంది కలెక్టర్ల వద్ద పనిచేసినట్లు తెలిపారు. కలెక్టర్ల ఆలోచనలకు అనుగుణంగా పనిచేసినట్లు చెప్పారు. ఎవరినీ నొప్పించని మనస్తత్వం ఉన్న కలెక్టర్ వద్ద డీఆర్వోగా విధులు నిర్వహించడం అదృష్టమన్నారు. చిత్తూరులో పనిచేసిన అనుభవం ఎప్పటికీ మరువలేనిదన్నారు. అనంతరం డీఆర్వో పుల్లయ్యను పలువురు అధికారులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నూతన డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, డీఎస్ఓ శంకరన్, సంక్షేమ శాఖ అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీబాషా, కలెక్టరేట్ సిబ్బంది రాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కోకు బకాయిలు రూ.6 కోట్లు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్



హాజరైన కౌన్సిలర్లు

- నీటి సరఫరా మోటార్లకే నెలకు రూ.18 లక్షల బిల్లులు
- గుదిబండగా ఈటీపీ నిర్వహణ
- పన్నుల వసూలులో రాష్ట్రంలో నగరి చివరి స్థానం
- మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి: ట్రాన్స్‌కోకు ఇప్పటికే రూ.6కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని, మరోవైపు ప్రతి నెలా తాగునీటి సరఫరాకు సంబంధించిన 177 మోటార్లకే రూ.18లక్షలు చెల్లిస్తున్నామని, దీనిని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, సిబ్బంది విద్యుత్‌ను పొదుపుగా వాడాలని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. తొలుత అజెండా అంశాలను మున్సిపల్ అధికారులు నివేదించారు. ఆ తర్వాత వార్డుల్లో సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పైవిధంగా మాట్లాడుతూ, మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ చాలా లోటు ఉందని, ఆదాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌కోకు బకాయిల మోత పెరిగిపోతోందని, వీధి దీపాలకు నెలకు రూ. 10 లక్షలు అవుతోందన్నారు. మరోవైపు ఈటీపీ ప్లాంటు నిర్వహణదారులు విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో అది గుదిబండగా మారిందన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మున్సిపాలిటీకి రావలసిన ఆస్తి పన్ను బకాయిలు రూ. 4.30 కోట్లు, నీటి పన్ను బకాయిలు రూ.2.09 కోట్లు ఉందన్నారు. పన్నుల వసూళ్లలో రాష్ట్రంలో చివరిస్థానంలో ఉన్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో పన్నుల వసూలుకు సహకరించాలని, పన్నులు పూర్తిస్థాయిలో వసూలైతే విద్యుత్ బకాయిలు చెల్లించి అభివృద్ధి పనులు కూడా చేయడానికి అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశారు. ఈటీపీ ప్రారంభంలో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం డైయింగ్ యూనిట్ అసోసియేషన్ దాని నిర్వహణ బాధ్యత స్వీకరించాలని, అప్పుడే ఆ భారం మున్సిపాలిటీపై తగ్గుతుందన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి, సీడీపీఓ కృష్ణవేణి, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డీఈఓతో ఉపాధ్యాయ సంఘాల భేటీ



డీఈఓను కలిసిన పీఆర్‌టీయూ నాయకులు



డీఈఓను కలిసిన ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈఓ వరలక్ష్మిని పీఆర్‌టీయూ, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ సంఘాల నాయకులు డీఈఓకు పుష్పగుచ్ఛాలు అందజేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం జిల్లాలోని టీచర్ల సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, స్వామికణ్ణన్, ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, జిల్లా అధ్యక్షుడు మురళి, నాయకులుప్రభుకుమార్,సంగీత, జయమ్మ పాల్గొన్నారు.